# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 37 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల ఆదివారం 11 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 37 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SUN 11 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



- 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు
- సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి నిరసన
- కార్యక్రమానికి అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో

- మిగతా 2లో

## ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం



- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడి
- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం

- మిగతా 2లో

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయిం చారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.




# జగన్‌కు ఈడీ షాక్..

## అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ల పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.



## ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

### కేంద్రంపై నారాయణ తీవ్ర ఆగ్రహం

- ఢిల్లీలో నిర్బంధంపై కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ నారాయణ ఫైర్
- తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపుపై హర్షం
- కమ్యూనిస్టులను ఓడించాలన్న కాంగ్రెస్‌పై విమర్శలు

పెన్ పవర్ డెస్క్:సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని,

- మిగతా 2లో

## ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

### ఒకే రోజు రెండుసార్లు ప్రకంపనలు




- ఉత్తరాఖండ్‌ను వణికించిన మరో భూకంపం
- ఉత్తరకాశీలో 4.2 తీవ్రతతో ప్రకంపనలు
- శనివారం ఒక్కరోజే రెండుసార్లు కంపించిన భూమి
- బాగేశ్వర్‌లోనూ స్వల్ప తీవ్రతతో భూకంపం
- కొద్దిరోజుల క్రితం చమోలీలోనూ కంపించిన ధరణి

- మిగతా 2లో

## గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- తిరుమల గెస్ట్‌హౌస్‌పై కర్ణాటక ప్రభుత్వంతో టీటీడీకి వివాదం
- పవిత్ర స్థలాన్ని వ్యాపార కేంద్రంగా మార్చాలని చూస్తున్నారని ఆరోపణ
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:తిరుమలలోని కర్ణాటక ప్రభుత్వ గెస్ట్‌హౌస్ వ్యవహారంపై టీటీడీ తీవ్రంగా స్పందించింది. వివాదాస్పద నిర్ణయాన్ని కర్ణాటక సర్కార్ వెనక్కి తీసుకోకపోతే, ఆ గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా మార్చేందుకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు



- మిగతా 2లో



## ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి.. పోలీసులపై రాళ్ల దాడి

పెన్ పవర్ డెస్క్: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనతో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతుంది. జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆందోళనకారులు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకున్నారు. అయితే, సీజేపీ ప్రొటెస్ట్?కు అనుమతి లేదంటూ

- మిగతా 2లో



## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు

- మిగతా 2లో

## కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసు కుంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తమిళనాడు సీఎం, టీవీకే అధినేత సి. జోసెఫ్



- మిగతా 2లో

## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

పెన్ పవర్ డెస్క్: ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఢిల్లీలో పై 'చేయి' ఎవరిది ?!

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగ యువతను కాక్రోచెస్ పోల్చడంతో వ్యంగ్యంగా మొదలైన కాక్రోచ్ జనతాపార్టీ నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ జంతర్ మంతర్ లో చేసిన ఆందోళనలతో బలపడింది. సీజేపీ ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న కేంద్రం చివరకు ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాల్సి వచ్చింది.సర్ ప్రక్రియలో భాగంగా దేశంలో సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించిన నేపథ్యంలో ఎన్నికల కమీషన్ లో ఉన్న ఇద్దరు కమీషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు సర్ కు ప్రక్రియ కొనసాగుతున్న వివాదం మీద అభ్యంతరాలు నమోదు చేసినట్లు వార్తలు బయటకు వచ్చాయి.దీంతో అర్హులైన ఓటర్లను ఓటు హక్కు నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఓటు డాటా బేస్ నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడాన్ని ప్రతిపక్షాలు, సీజేపీ దీనిని ఓటు చోరీగా పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సీజేపీ 'జంతర్ మంతర్ 2.0' పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చింది.సీజేపీ ఆందోళనలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. 25 వేల పారామిలటరీ బలగాలను మోహరించారు. రైళ్లను రద్దు చేశారు. 45 మెట్రో స్టేషన్లలో ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ పెద్ద ఎత్తున మళ్లించారు. దీంతో ఢిల్లీలో ట్రాఫిక్ జామ్ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో ఆందోళన చేసేందుకు ఢిల్లీకి వచ్చిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే, నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ లో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్ చేశారు. ప్రముఖ యూట్యూబర్ ధృవ్ రాఠీని గురుగ్రామ్ లో, సీజేపీ లీగల్ టీమ్ హెడ్ రత్నసింగ్ ను వారి నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. రైళ్లు రద్దు చేస్తూ ఆందోళనలు అదుపులోకి తేవాలని చేసిన ప్రభుత్వ చర్యలపై 'ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగిస్తారా' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.ప్రస్తుతం ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ చర్యలను సీజేపీ నియంతృత్వం, యువతను ప్రభుత్వం భయపెడుతోందని, మోడీ ఓటమి అంగీకరించాడని చెబుతుంది. ఢిల్లీని కంటోన్మెంట్ గా మార్చారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.గతంలో జరిగిన ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న ప్రభుత్వం తర్వాత అణచివేతకు కఠినంగా వ్యవహరించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కేంద్ర మంత్రి రాజీనామా చేయక తప్పలేదు. ప్రస్తుత ప్రభుత్వ చర్యలు నివారణాత్మకమేనా ? లేక అణచివేతనా ? అరెస్టు అయినవారు, అదుపులోకి తీసుకున్న వారు ఎప్పుడు విడుదల అవుతారు ? నిరసన ఎలా ముందుకు సాగుతుంది అన్న ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలో ఎవరిది పైచేయి అవుతుందో తెలియాలంటే వేచిచూడాల్సిందే.

# విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

- మొదటి పేజి తరువాయి

ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

# ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం

- మొదటి పేజి తరువాయి

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు.రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు.ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ.జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

### నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.

ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు.

మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

### అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది.

ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

# ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది.

ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు.

ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.

# 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

# ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి..

- మొదటి పేజి తరువాయి

నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకుని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో పోలీసులతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జంతర్ మంతర్ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆగ్రహానికి గురైన నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఈ దాడిలో ఇద్దరు పోలీస్ సిబ్బంది గాయపడ్డట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన పోలీసులు లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు.

కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. జంతర్ మంతర్ వెళ్లే అన్ని మార్గాలను క్లోజ్ చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. తీవ్ర నిర్బంధం ఉన్న నిరసనకారులు ధైర్యంగా రోడ్లపైకి వస్తున్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్న?న్నారు. సీజేపీ నిరసన నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలో ఇప్పటికే పోలీసులు కఠిన ఆంక్షలు అమలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలను నిలిపివేయడంతో పాటు మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మరోవైపు జంతర్ మంతర్ దగ్గర బొద్దింక జనతా పార్టీ చేపట్టిన నిరసనలో పాల్గొంటారనే అనుమానంతో ఢిల్లీలోని లోధి ఎస్టేట్ వెలుపల ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులను నిర్బందించారు. టీఎంసీ అధినేత్రి, బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీని సైతం ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు.

# గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమల కొండ, సప్తగిరులు మొత్తం శ్రీ వేంకటేశ్వర స్వామికే సొంతమని, ఇతరులకు కేటాయించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని స్పష్టం చేశారు. గతంలో మైసూరు మహారాజుకు టీటీడీ 7.5 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, దానిపై కర్ణాటక ప్రభుత్వం గెస్ట్‌హౌస్ నిర్మించుకుందని గుర్తుచేశారు.ఇటీవల కర్ణాటక కేబినెట్ ఈ గెస్ట్‌హౌస్‌ను తమ రాష్ట్ర పర్యాటక శాఖకు అప్పగించాలని నిర్ణయించిందని, ఈ నిర్ణయం వెనుక ఓ కాంగ్రెస్ మాజీ కేంద్ర మంత్రి హస్తం ఉందని భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వారికి నోటీసులు పంపుతామని, స్పందించకపోతే గెస్ట్‌హౌస్‌ను టీటీడీ ఆధీనంలోకి తీసుకుంటుందని తేల్చిచెప్పారు.

# ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

- మొదటి పేజి తరువాయి

ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు.

శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు.

ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

- మొదటి పేజి తరువాయి

విజయ్‌ను అక్టోబర్ 10, 2026న చెన్నైలో భేటీ అయ్యారు. తొలుత విజయ్ నివాసంలో సుమారు గంటపాటు సమావేశమైన ఇరువురు నేతలు, ఆ తర్వాత సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాఫీ తాగారు. ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.విజయ్ నివాసంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర, జాతీయ రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.సమావేశం అనంతరం ఇద్దరూ సమీపంలోని కేఫ్‌కు వెళ్లారు. అక్కడ కాపుచినో కాఫీ, తిరమిసు, కుకీలు తీసుకున్నట్లు పీటీఐ వార్తా కథనం పేర్కొంది. కాంగ్రెస్, టీవీకే కలిసి పనిచేస్తున్న క్రమంలో కూటమి ఉమ్మడి కనీస కార్యక్రమం, భవిష్యత్తు ఎన్నికల ప్రణాళికలపై చర్చించే అవకాశం ఉందని సమావేశానికి ముందు వార్తలు వచ్చాయి. అయితే చర్చించిన ప్రతి అంశంపై అధికారిక ఎటువంటి ప్రకటన వెలువడలేదు.చెన్నైలోని ఐలాండ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'ఛత్రోన్ కి గూంజ్' (మానవర్గళిన్ కురల్) విద్యార్థుల కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ తమిళనాడుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడనున్నారు రాహుల్ . విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాహుల్ గాంధీతో జరిగిన ఈ భేటీ..కాంగ్రెస్, టీవీకే రాజకీయ సంబంధాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## గుంటూరులో శ్రీ దేవి నవరాత్రుల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10.**

గుంటూరు నగరం గుంటూరు-3లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 164వ శ్రీ వాసవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల 11-10-2026 నుంచి 20-10-2026 వరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

## ఆటోనగర్ లో పర్యటించిన కలెక్టర్, ఎం.ఎల్.ఏ ఆటోనగర్ అభివృద్ధికి చర్యలు





**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 10 :**

గుంటూరు ఆటోనగర్ లో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ , గుంటూరు (తూర్పు) శాసన సభ్యులు నసీర్ అహ్మద్ శనివారం పర్యటించారు. ఆటోనగర్లో వసతులు, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటోనగర్ అభివృద్ధికి దశలవారీగా చర్యలు చేపడతామని చెప్పారు. రూ. 30 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని అన్నారు. ఆటోనగర్లో పారిశుద్ధ్య పనులు, రహదారుల నిర్మాణం వంటి అవసరాలను గుర్తించామని తెలిపారు. అచ్యుత ఉన్న తుక్కు (స్క్రాప్) మరో ప్రాంతానికి ప్రదేశానికి తరలించుటకు అవకాశాలు పరిశీలిస్తున్నామని అన్నారు. అదేవిధంగా అవసరం లేని పరికరాలను రోజువారి తరలించుటకు అవకాశాలు ఏ మేరకు ఉన్నాయో గుర్తిస్తామని చెప్పారు. గుంటూరు నగరంలో చక్కటి ఆటోనగర్ ఏర్పాటు జరుగుటకు, అందరి అవసరాలు తీర్చే విధంగా ఉండాలని భావిస్తున్నామని అన్నారు. మంచి ఆటోనగర్ ఏర్పాటు వలన ఉపాధి అవకాశాలు కూడా పెంపొందగలరని ఆశ భావం వ్యక్తం చేశారు. శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ చక్కటి రహదారులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, గుంటూరు నగరపాలక సంస్థ కార్యనిర్వహక ఇంజనీర్ సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే 30 ఏళ్లలో మరిన్ని రికార్డులు సాధిస్తాం: కేంద్ర మంత్రి పెమ్మసాని





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10,**

గుంటూరు జిల్లా బుర్రిపాలెం గ్రామం 3డీ ప్రింటెడ్ ఇళ్ల నిర్మాణంతో చరిత్ర సృష్టించిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాబోయే 30 ఏళ్లలో గ్రామం మరిన్ని రికార్డులు సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అక్టోబర్ 4న బుర్రిపాలెంలో జరిగిన 3డీ ప్రింటెడ్ ఇళ్ల కార్యక్రమం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా 3 లక్షల ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామస్థులకు పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారంబుర్రిపాలెంలోని స్థానిక కళ్యాణ మండపంలోనిర్వహించినసమావేశంలోబుర్రిపాలెం,చక్రాయపాలెంగ్రామస్థులతోఆయనసమావేశమయ్యారు.ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. 3డీ ఇళ్ల నిర్మాణం కోసం ఎప్పటి నుంచో కృషి చేస్తున్నామని, కార్యాచరణ పూర్తయ్యే వరకు ఈ విషయాన్ని ఎవరికీ వెల్లడించలేదని తెలిపారు. మూడు లక్షల ఇళ్ల మంజూరుపై భారీ కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సూచించారని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రజలకు సంబంధించిన కార్యక్రమం కావడంతో ఎక్కువ మంది రావడం కంటే, వచ్చినవారు ప్రేమతో పాల్గొనడం ముఖ్యమని భావించి సొంత గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. తక్కువ సమయం ఉన్నప్పటికీ గ్రామస్థులందరూ ఎంతో కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అభినందించారు.నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకేసారి తమ గ్రామానికి రావడం, గ్రామస్థులు వారిని ఘనంగా ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ప్రస్తుతం 3డీ ఇళ్ల నిర్మాణం రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, సామాజికమాధ్యమాల్లోనూ ఈ కార్యక్రమంపై విస్తృతంగా చర్చ జరుగుతోందని తెలిపారు. అన్నీ సక్రమంగా సాగితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సైతం బుర్రిపాలెం గ్రామానికి తీసుకువచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.బుర్రిపాలెంలో తొలిసారిగా 100 మూడు డీ ఇళ్ల నిర్మాణం చేపట్టడం గ్రామ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టమని, రాబోయే 30 ఏళ్లలో ఇలాంటి మరెన్నో రికార్డులు సృష్టిస్తామని గర్వంగా చెప్పగలనని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌లో గుంటూరు విద్యార్థులు అత్యధికంగా అర్హత సాధించాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి






**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10,**

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో గుంటూరు విద్యార్థులు అత్యధిక సంఖ్యలో అర్హత సాధించి, కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో ఎనిమిదో తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..లి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించేందుకు ఎన్ఎంఎంఎస్ఉపకారవేతనాలుఎంతగానోఉపయోగపడతాయన్నార ు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందిస్తే మంచి ఫలితాలు సాధించగలరన్నారు.మానవత సంస్థ గత ఏడాది సుమారు 200 మంది విద్యార్థులు అర్హత సాధించేలా శిక్షణ అందించిందని, ఈ ఏడాది 700 మందికి పైగా విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏసీ కళాశాల ప్రాంగణంలో డిజిటల్ పద్ధతుల్లో ఉచితంగా శిక్షణ అందించడం, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న సంస్థ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, దాతలు, కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు.

ఎన్ఎంఎంఎస్ శిక్షణ ఉపకార వేతనాలకే పరిమితం కాదని, భవిష్యత్తులో వివిధ ప్రతిభా, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పునాదిగా నిలుస్తుందని చెప్పారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యంపై దృష్టి సారించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భారత్‌పేటకు చెందిన షణ్ముఖ అనే విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే, గతంలో విద్యార్థులను ఢిల్లీకి తీసుకెళ్లిన విధంగా తననూ తీసుకెళ్తారా అని అడిగాడని ఎమ్మెల్యే తెలిపారు. ఆ విద్యార్థి మంచి ఫలితాలు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందాలని ఆకాంక్షించారు. అతని కలలను సాకారం చేసుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని, వారికి సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు.

## దసరా ఉత్సవాల ఏర్పాట్లపై అధికారుల సమీక్ష





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10,**

కొండ దిగువ భాగంలోని ఇరిగేషన్ మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు, ఈవో వీకే శీనా నాయక్ తదితరులు శుక్రవారం సందర్శించారు.క్షేత్రస్థాయి అధికారులతో నిరంతరం సమాచార మార్పిడి చేసుకునేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. డిజిటల్ బోర్డుల పనితీరును సమీక్షించి, దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## అగ్రిగోల్డ్ బాధితుల అవస్థలు.. 12 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురుచూపులు



**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10,**

గుంటూరు: అగ్రిగోల్డ్‌లో పొదుపు చేసుకున్న సొమ్ము తిరిగి వస్తుందనే ఆశతో 12 ఏళ్లుగా పోరాడుతున్న నిరుపేద బాధితుల దుస్థితికి ఈ దృశ్యాలు అద్దం పడుతున్నాయి. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలోని చెంచు కాలనీకి చెందిన ఎస్టీ నిరుపేద బాధితులు అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన, నమోదు కోసం గుంటూరు సీఐడీ కార్యాలయానికి వచ్చి, అక్కడే భోజనాలు చేస్తూ కనిపించారు.రోజువారీకూలిపనులు చేసుకుంటూ, కొందరుభిక్షాటన చేస్తూ, మరికొందరు పెదకాకాని పుట్టతోటవద్ద పూలు అమ్ముకుంటూ సంపాదించిన కొద్దిపాటిమొత్తాలను అగ్రిగోల్డ్‌లో పొదుపు చేశారు. ఇప్పుడు తమ కష్టార్జితం తిరిగి పొందేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో జీవనం సాగించే ఈ పేదలకు ఒక్కొక్కరికి రూ.30 వేలకు పైగా అసలు రావాల్సి ఉందని బాధితుల తరఫు వారు తెలిపారు. చిన్నచిన్న మొత్తాలను పొదుపు చేసుకుంటూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వీరు, అగ్రిగోల్డ్ సంస్థ మోసపూరిత ద్రోహంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ డబ్బులు తిరిగి వస్తాయనే నమ్మకంతో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా, ఇప్పటికీ పూర్తిస్థాయిలో న్యాయం జరగకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కూలి పనులు, పూల విక్రయాలు, భిక్షాటన ద్వారా కూడబెట్టిన సొమ్మును కోల్పోయిన ఈ నిరుపేద కుటుంబాలకు ఆ డబ్బులే జీవనాధారం. తమ అవసరాలను సైతం పక్కనపెట్టి పొదుపు చేసిన మొత్తాల కోసం ఇన్నేళ్లుగా పోరాడాల్సి రావడం బాధాకరమని బాధితులు వాపోతున్నారు. బాండ్ల పరిశీలన, నమోదు కోసం గుంటూరుకు వచ్చిన వీరు కార్యాలయం బయటే భోజనాలు చేస్తూ కనిపించడం పలువురిని కలచివేసింది.ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆగస్టీన్, సీపీఐ నాయకుడు పుప్పాల సత్యనారాయణ తదితరులు బాధితులను పలకరించి ధైర్యం చెప్పారు. బాధితులకు న్యాయం జరిగేలా తమ పోరాటం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. అగ్రిగోల్డ్‌లో పొదుపు చేసిన నిరుపేదల కష్టార్జితాన్ని తిరిగి చెల్లించే విషయంలో ప్రభుత్వం మరింత వేగంగా స్పందించాలని, అర్హులైన బాధితుల బాండ్ల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తిచేసి వారికి రావాల్సిన సొమ్మును అందించాలని కోరారు.పన్నెండేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న వెనిగండ్ల చెంచు కాలనీ నిరుపేద బాధితుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి, వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధితులు, వారి తరఫున పోరాడుతున్న సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్ తోనే రాష్ట్ర అభివృద్ధి:-ఎంపీ పురందేశ్వరి

## బిజెపిని బలోపేతం చేస్తూ కూటమిని ముందుకు తీసుకువెళ్తాం అని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు

**పెన్ పవర్,కృష్ణాజిల్లా పెనమలూరు, అక్టోబర్ 10**

పోరంకిలో బిజెపి పార్టీ నూతన జెండా దిమ్మను పురందేశ్వరి ఆవిష్కరించారు ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ..అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి సర్కారు పనిచేస్తుందికేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి పనులు వేగం పుంజుకున్నాయి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ముందుకు వెళుతుందని ఇప్పటికే పేర్కొన్నారని గుర్తు చేశారు స్థానిక సంస్థల ఎన్నికల్లో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ అటు కేంద్రం ఇటు రాష్ట్రం కూటమి అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకుని ఈరోజు జరగనున్న క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు



## అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు కమిషనర్ కె.మయూర్ అశోక్




**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 10,**

నగర పాలక సంస్థ పరిధిలో నిర్మాణాలు అనుమతించిన ప్రణాళిక ప్రకారమే జరిగేలా పట్టణ ప్రణాళిక అధికారులు సమర్ధవంతంగా పర్యవేక్షించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. శనివారం దుర్గానగర్, అలీనగర్, ఐపిడి కాలనీ, బొంతపాడు రోడ్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి, నిర్మాణాలు, పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులను పరిశీలించారు.దుర్గానగర్‌లో అనుమతించిన ప్రణాళికకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. అనుమతి లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి నిర్మాణం వద్ద నగర పాలక సంస్థ నుంచి పొందిన అనుమతి ప్రణాళికను తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.అలీనగర్, సుద్దపల్లి డొంక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరగాలని ఆదేశించారు. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిపై క్రమం తప్పకుండా ఆయిల్ స్ప్రే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టెండర్లు పూర్తయి, అనుమతులు పొందినప్పటికీ ప్రారంభం కాని పనులను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో, నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, ఏసీపీ జకిరా, డీఈఈ హనీఫ్, ఎస్ఎస్ ఐజాక్‌తో పాటు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## P4 తో సామాజిక సేవలో సమాజానికి ఉపయోగపడాలి:-ఎమ్మెల్యే బోడె ప్రసాద్

## ఎమ్మెల్యే చేతుల మీదగా పేద మహిళలకు తోపుడు బండి పంపిణీ..




**పెన్ పవర్,కృష్ణాజిల్లాపెనమలూరు, అక్టోబర్ 10**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా సోనోవిజన్ తో ఎంతోమందికి ఉపాధి ఏర్పాటు చేసిన జనార్ధన్ మూర్తి సహకారంతో్రా4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు జీవనోపాధి నిమిత్తం తోపుడు బండి పంపిణీ చేయడం జరిగింది సామాజిక సేవలో పేదవారికి ఉపయోగపడాలని వారు చేస్తున్న కార్యక్రమం అభినందనీయమన్నారు యనమలకుదురు ప్రాంతానికి చెందిన షర్మిల కు వ్యాపారం నిమిత్తం తోపుడు బండి అందించడం జరిగిందన్నారు సోనోవిజన్ జనార్ధన్ మూర్తి ప్రతి నెల్రా4 లో భాగంగా సేవ కార్యక్రమాలు చేస్తానని ముందుకు రావడం ఆదర్శనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఆయనను చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని నేటి యువతకు ఆయన ఆదర్శమని తెలిపారు జనార్ధన్ మూర్తి మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు

ప్రతినెల P4 లో భాగంగా పేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తామన్నారు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికి స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారుఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, పెనమలూరు మండల టిడిపి అధ్యక్షులు కోయా ఆనంద్, యనమలకుదురు టిడిపి నాయకులు అశోక్ చక్రవర్తి, సుంకర చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు

# వేటపాలెం వాసవి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు

## పది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు






**వేటపాలెం, అక్టోబర్ 10, (పెన్ పవర్ ) :**

వేటపాలెంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 11 ఆదివారం నుంచి అక్టోబర్ 20 మంగళవారం వరకు దేవీ శరన్నవరాత్రోత్సవముల ను ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం అధ్యక్షుడు మాజేటి వెంకట సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల వివరాలను వెల్లడించారు.పది రోజుల పాటు అమ్మవారికి వివిధ రూపాల్లో ప్రత్యేక అలంకరణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 11న బాలా త్రిపుర సుందరిదేవి అలంకారం, 12న గాయత్రీ దేవి అలంకారం, 13న కాత్యాయనీ దేవి అలంకారం, 14న అన్నపూర్ణ దేవి అలంకారం, 15న మహాలక్ష్మీ దేవి అమ్మవారు అలంకారం, 16న శ్రీ సరస్వతీ దేవి అలంకారం, 17న రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారం, 18న దుర్గాదేవి అలంకారం, 19న మహిషాసుర మర్దిని దేవి అలంకారం, 20న శ్రీ విజయ వాసవి దేవి అలంకారాలతో పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో మాజేటి వెంకట సుబ్బారావు, బాపనపల్లి విప్రనారాయణ, శీరాం సుబ్బారాయుడు, కోడూరి రామకృష్ణ మరియు చుండూరి సురేష్ తదితరులు పాల్గొన్నారుభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని, దేవీ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# చీరాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు!

## ఉదయం ఐదు గంటల నుంచే అమ్మకాలు.. అర్ధరాత్రి దాటినా అందుబాటులో మద్యం





**-నిబంధనలు అమలు చేయరా? తనిఖీలు చేపట్టరా? అధికారుల తీరుపై స్థానికుల ప్రశ్నలు**



**చీరాల, అక్టోబరు 10, (పెన్ పవర్) :**

చీరాల ప్రాంతంలో మద్యం విక్రయాలు సమయపాలన లేకుండా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం ఐదు గంటల నుంచే మద్యం విక్రయాలు ప్రారంభమవుతున్నాయని, ప్రభుత్వం నిర్దేశించిన సమయం ముగిసిన తర్వాత కూడా కొన్ని ప్రాంతాల్లో అమ్మకాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లోనూ మద్యం అందుబాటులో ఉంటుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం విక్రయాలకు సమయపాలన లేదా? నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.చీరాలలోని ప్రధాన కూడళ్ల వద్ద, ప్రధాన రహదారులకు ఇరువైపులా, ఫ్లైఓవర్ కింద ఉన్న ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్దేశిత సమయాలకు మించి విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్నారా?మద్యం దుకాణాలు, బార్లలో సంబంధిత శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మద్యం సేవించిన కొందరు రాత్రివేళల్లో హడావుడి చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు తక్షణమే స్పందించాలిమద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మద్యం దుకాణాలు, బార్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, విక్రయ సమయాల ఉల్లంఘనలను గుర్తించాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చీరాల ప్రాంతంలో మద్యం విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, నిర్దేశిత సమయాల్లోనే అమ్మకాలు జరిగేలా చూడాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ల ముఖ్య అతిథిగా పాల్గొన్న కూటమినేతలు







**పెన్ పవర్ కారంపూడి అక్టోబర్ 10**

స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి SGF అండర్-14 & అండర్ -17 బాలబాలికల పోటీలను తెలుగుదేశ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి.అంజయ్య గారు ప్రారంభించారు. స్వర్ణ రాజు మాట్లాడుతూ 130 మంది పాల్గొన్నరని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గొళ్ళ.సురేష్ యాదవ్,సీనియర్ నాయకులు చప్పిడి.రాము, మహేష్, ప్రధానోపాధ్యాయులు ఐ.శివ శేషిరెడ్డి, మరియు వెంకటేశ్వర్లు ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు విచ్చేసిన వెంకట కృష్ణ,రమేష్, పల్నాడు జిల్లా వా+ఖీ అడ్మిన్ సెక్రటరీ షేక్.రషీద, పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి పి.ఖాదర్ మస్తాన్ మరియు మండల నాయకులు మరియు జిల్లా నలుమూలలనుంచిచేసినవ్యాయామ ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు స్థానికపాఠశాలఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నారుల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రాధాన్యం ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10,**

ప్రతి చిన్నారికి విద్యను అందించాలనే లక్ష్యంతో వలస కార్మికులపిల్లలసంరక్షణకుసీజనల్ హాస్టళ్లు ఎంతగానో ఉపయోగపడతాయనిగుంటూరుపశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్ దుర్గా నగర్ లో సీజనల్ హాస్టల్‌ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించారు. స్థానికంగా నివసిస్తున్న వలస కార్మికులు తమ పిల్లలను ఈ హాస్టల్‌లోచేర్పించి,విద్యనుఅందించాలనిసూచించారు. హాస్టల్‌కు వచ్చే విద్యార్థులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా అందిస్తారని తెలిపారు.ఈ సందర్భంగాఎమ్మెల్యేగళ్ళామాధవిమాట్లాడుతూ...

వలస కార్మికుల కోసం భారత ప్రభుత్వం సీజనల్ హాస్టళ్లను నిర్వహిస్తోందని, వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉపాధి కోసం ఆయా ప్రాంతాలకు వలస వెళ్లడం అనేది చాలా కాలంగా కొనసాగుతున్న పరిస్థితి అని పేర్కొన్నారు. ముఖ్యంగా సీజన్‌ను బట్టి పనుల కోసం ఇతర ప్రాంతాలకు వచ్చే కుటుంబాలు, అక్కడే శాశ్వతంగా నివసించే పరిస్థితి లేకపోవడంతో వారి పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా సీజనల్ హాస్టళ్లు దోహదపడతాయని వివరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మిర్చి యార్డు ఉండటంతో ఒడిశా, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు పనుల కోసం వస్తుంటారని, ఈ నేపథ్యంలో వారి పిల్లలకు రక్షణ కల్పించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించేందుకు సీజనల్ హాస్టళ్లు ఎంతో అవసరమన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సీజనల్ హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, వలస కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మన ప్రాంతానికి ఉపాధి కోసం ఎక్కడి నుంచో వచ్చిన వలస కార్మికుల పిల్లలు కూడా మన బాధ్యతేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ప్రతి చిన్నారికి చదువుకునే అవకాశం కల్పించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# బాల్య వివాహాలను అంతం చేయాలి.. బాలికల హక్కులను కాపాడాలి





**విజయవాడ,పెన్ పవర్,అక్టోబర్ 9:**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని చుండూరు వెంకటరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది బాల్య వివాహాలను అంతం చేయండి.. బాలికల హక్కులను కాపాడండి అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, జిల్లా సమగ్ర శిక్ష అధికారి రమేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా షేక్ రుక్సానా సుల్తానా బేగం మాట్లాడుతూ, 2011 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.చంద్రకళ మాట్లాడుతూ, బాలికలు బాల్య వివాహాలకు దూరంగా ఉంటూ, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.రమేష్ బాబు మాట్లాడుతూ, బాలికల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక హక్కులు, పథకాలు కల్పిస్తోందని తెలిపారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు.అనంతరం బాలికలకు స్వీయ రక్షణపై అవగాహన కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం. రాజేశ్వరరావు, బాలికల అభివృద్ధి అధికారి నవభారతి, లయోలా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్, ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటి:-వీరంకి గురుమూర్తి

## అత్యవసర వేళల్లో అభాగ్యులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం:-అనుమోలు ప్రభాకర్ రావు



**పెన్ పవర్,కృష్ణాజిల్లా పెనమలూరు, అక్టోబర్ 10**

పోరంకిటిడిపికార్యాలయంలోముఖ్యమంత్రిసహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు 8 మంది లబ్ధిదారులకు 14 లక్షల 28 వేల రూపాయల విలువ గల చెక్కుల పంపిణీ

టిడిపి అధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ..

ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రతి ఆసుపత్రిలో పేదవాడికి ఉచిత చికిత్స అందిస్తున్నాం ఉచిత వైద్యం కింద రాని వాటికి ముఖ్యమంత్రి సహాయనిధి, ఎల్ ఓ సి లు అందిస్తున్నామని తెలిపారు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 26 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి అందించారని పేర్కొన్నారు గత ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి తన అనుచర వర్గానికి మాత్రమే సహాయం అందించి మిగిలినవారికి మొండి చేయి చూపించారని అన్నారు

గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో 800 కోట్లుఇస్తేకూటమిప్రభుత్వంరెండున్నర సంవత్సరాలలో 2000 కోట్ల సహాయనిది అందించిందని గుర్తు చేశారు పేద బడుగు బలహీన వర్గాల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఈ గణాంకాలతో తెలుస్తోందని పేర్కొన్నారు అడగటమే ఆలస్యం అన్న విధంగా అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి అందిస్తున్నామని తెలిపారు

గత ప్రభుత్వం ఐదేళ్లు దోచుకుని రాష్ట్రాన్ని నాశనం చేశారని..రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారుప్రతి పల్లెలో నూతన రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, సంక్షేమం అభివృద్ధి సమపాళ్లల్లో అందిస్తున్నామన్నారుమున్సిపాలిటీఅధ్యక్షులుఅనుమోలు ప్రభాకర్ రావు మాట్లాడుతూవివిధ కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు 14 లక్షల విలువ గల చెక్కుల పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు నియోజకవర్గ వ్యాప్తంగా 26 కోట్ల రూపాయలు ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి అందించామని తెలిపారు గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి రద్దు చేసిందని తెలిపారు

పేదల పక్షాన ఉంటూ ఆర్థిక భరోసా ఇస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారుఈ కార్యక్రమంలో పెనమలూరు మండల అధ్యక్షులు కోయా ఆనంద్, టిడిపి నాయకులు సుంకర చిన్న బాబు, అశోక్ చక్రవర్తి, అంగిరేకుల మురళి, బొంగరాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ స్టేడియం అభివృద్ధి పనులకు శ్రీకారం రూ.5 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి



**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10,**

గుంటూరు నగరంలోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని అన్ని సదుపాయాలతో అత్యుత్తమ స్టేడియంగా తీర్చిదిద్దనున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి స్టేడియంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్టేడియంలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంతో పాటు వర్షాకాలంలో వాకర్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగిస్తామన్నారు. స్టేడియం అభివృద్ధికి శాప్ ద్వారా రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, వీటితో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, ఇండోర్ స్టేడియం పనులు చేపడతామని తెలిపారు. నగరపాలక సంస్థ ద్వారా కూడా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సరైన అభివృద్ధికి నోచుకోని బీఆర్ స్టేడియాన్ని కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేస్తోందన్నారు. ఖేలో ఇండియా ద్వారా రూ.14 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ అరేనా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

శాప్ ద్వారా రూ.కోటి, నగరపాలక సంస్థ ద్వారా రూ.4 కోట్లతో మొత్తం రూ.5 కోట్ల నిధులతో వాకింగ్ ట్రాక్, మంచినీటి వసతి, మరుగుదొడ్లు, యోగా హాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, జిమ్నాస్టిక్స్ తదితర సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.



## విద్యార్థులు నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

## మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సిద్ధం కావాలి: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు





**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 10:**
మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులుతమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, భవిష్యత్తులోఅందుబాటులోకివచ్చేఉద్యోగఅవకాశాలన ంఅందిపుచ్చుకునేందుకుసిద్ధంగాఉండాలనినరసరావు పేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. శనివారం నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన నూతన విద్యార్థుల స్వాగత వేడుకల్లో ఎంపీ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం మంచి మార్కులు సాధించడం మాత్రమే కాకుండా, విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించడం, ఆలోచనా శక్తినిపెంపొందించుకోవడం,సమస్యలకు పరిష్కారాలు కనుగొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ఎంతో ముఖ్యమనిపేర్కొన్నారు. కృత్రిమ మేధ, స్వయంచాలక సాంకేతికపరిజ్ఞానం, అంతర్జాతీయ వీసా నిబంధనల్లో మార్పుల కారణంగా సమాచార సాంకేతిక రంగంలో ఉద్యోగాల స్వరూపం మారుతోందని తెలిపారు. ఈ మార్పులను అర్థం చేసుకుని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. నిరంతరం నేర్చుకునే అలవాటునుపెంపొందించుకుంటేభవిష్యత్తులోమెరుగై నఅవకాశాలనుసాధించవచ్చనిఅన్నారు.ఆంధ్రప్రదేశ్ల ో ప్రభుత్వ ప్రోత్సాహం, విద్యా రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు, కొత్త సమాచార సాంకేతిక సంస్థల రాక, పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా ఏర్పడుతున్న అవకాశాలనువిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాలలో గడిపే నాలుగేళ్ల సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువుతోపాటుఇతరరంగాల్లోనూప్రతిభనుపెంపొంది ంచుకోవాలనిసూచించారు.తోటివిద్యార్థులు,సీనియర్లు, అధ్యాపకులతో సమన్వయంతో పనిచేయడం ద్వారా సంభాషణా నైపుణ్యాలు, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని వివరించారు. విద్యార్థులుతమలక్ష్యాలనునిర్దేశించుకుని,క్రమశిక్షణతో కృషి చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, అభివృద్ధి అంశాలపైకూడావిద్యార్థులుఅవగాహనపెంచుకోవాల నిఎంపీ సూచించారు. సివిల్స్‌లో విజయం సాధించిన ఐఏఎస్ అధికారి ఎం. జైకృష్ణ ప్రయాణం నుంచి స్ఫూర్తి పొందాలని, లక్ష్య సాధనకు పట్టుదల, కృషి, నిరంతర అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఐఏఎస్ అధికారి ఎం. జైకృష్ణ, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయడమేలక్ష్యం:మంత్రి పెమ్మసాని





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 10,**
గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 పథకం కింద మంచినీటి చెరువు పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులను కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బి. రామాంజనేయులు, టీడీపీ నాయకుడు వంగవీటి రాధాకృష్ణతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వాటర్‌షెడ్ పథకం ద్వారా గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు.దేశంలోనే తొలిసారిగా వెంగళాయపాలెం చెరువును సాయంత్రం వేళల్లో ప్రజలు నడకకు అనువుగా అభివృద్ధి చేసి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశామని, ఆ ప్రాజెక్టు విజయవంతమైందని పేర్కొన్నారు. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 100 చెరువులు, గుంటూరు జిల్లాలో 10 చెరువులను ఎంపిక చేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.టీడీపీ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ.. సమర్థులైన నాయకులు అధికారంలో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో పెమ్మసాని చంద్రశేఖర్ నిరూపిస్తున్నారని అన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మద్దతు ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.
ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బి. రామాంజనేయులు మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి 25 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేసే నాయకుడు పెమ్మసాని చంద్రశేఖర్ అని కొనియాడారు. గతంలో వెంగళాయపాలెం చెరువును అభివృద్ధి చేసిన తరహాలోనే గుంటూరు జిల్లాలో మరిన్ని చెరువులను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొరపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన

## విజయవాడలో 'ఓట్ చోర్' ఉద్యమం.. పాల్గొన్న ఆమంచి కృష్ణమోహన్, జేడీ శీలం







**విజయవాడ, అక్టోబర్ 10 (పెన్ పవర్):**
దేశవ్యాప్తంగా ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ చోర్' ఉద్యమంలో భాగంగాశనివారంవిజయవాడలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని లెనిన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చీరాల మాజీ ఎమ్మెల్యే, బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆమంచి కృష్ణమోహన్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఓటర్ల హక్కుల పరిరక్షణకు మద్దతు తెలిపారు.
ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (యస్ ఐ ఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాల రూపకల్పనలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.
ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల సహకారంతో లెనిన్ సెంటర్ నుంచి లోక్‌భవన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించి భద్రతా చర్యలు చేపట్టారు. వైఎస్ షర్మిలను ఆమె నివాసం వద్ద గృహనిర్బంధంలో ఉంచగా, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని భవానీపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, బీఎస్పీ నాయకులు, విద్యార్థి సంఘాలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులను కూడా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు.కేంద్రఎన్నికలప్రధాన కమిషనర్ రాజీనామాకు డిమాండ్‌కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు, ప్రజలకు రాజ్యాంగం కల్పించిన శాంతియుత నిరసన హక్కును గౌరవించాలని పేర్కొన్నారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల వ్యవస్థ భరోసా కల్పించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ తదితర జాతీయ స్థాయి నాయకులు చేపడుతున్న 'ఓట్ చోర్' ఉద్యమానికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఓటు హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్య పరిరక్షణ అనే లక్ష్యంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

## శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు

**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 10,**
ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆర్ అగ్రహారం గుంటూరు శ్రీ కనకవారమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు.2026 అక్టోబర్ 10వ తేదీ శనివారం ఉదయం 5 గంటల నుంచి శ్రీ లక్ష్మీ గణపతి, రుద్ర, చండీ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి పూర్ణాహుతి, అనంతరం తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమం జరగనుంది.అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమ్మవారి అలంకార మహోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.అక్టోబర్ 20వ తేదీ మంగళవారం మంగళవార పర్వదినం సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించనున్నారు.ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో



హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోట వెంకట శివ శేషగిరిరావు ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు

## ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ కళ్యాణ వెంకన్న



**పెన్ పవర్, అక్టోబర్, 10,**
పుంగనూరు పట్టణంలోని శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసులాచారి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం స్వామివారికి మహా మంగళహారతి సమర్పించారు.తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న ఈ శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో టీటీడీ ఆచారాల ప్రకారం నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు

## పట్టణంలో నిత్యం అభివృద్ధి పండగే : ప్రత్తిపాటి

## ప్రజలు ఆశ్చర్యపోయేలా చిలకలూరిపేట పట్టణ ప్రగతి

**రూ. 80 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.**





**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 10 :**
కూటమి పాలనలో పట్టణంలో నిత్యం అభివృద్ధి పండగేనని, అన్నివార్డుల్లో ప్రజలు ఆశ్చర్యపోయేలా రోడ్లు, డ్రైనేజ్ ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.
శనివారం ఆయన పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పలు వార్డుల్లో రూ.80 లక్షలతో చేపట్టే వివిధరకాల అభివృద్ధి పనులకు ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.
మున్సిపాలిటీల అభివృద్ధితో ప్రజల జీవనప్రమాణాలు మెరుగవుతాయి.ప్రజలుఆశ్చర్యపోయేలాచిలకలూరిపే ట పట్టణం ప్రగతి దిశగా సాగుతోందని, ఇకపై మున్సిపాలిటీలో ఎలాంటి సమస్యలు ఉండవని ప్రత్తిపాటి చెప్పారు. స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన రోడ్లు.. డ్రైనేజ్ లు, ప్రజారోగ్య పరిరక్షణలో భాగమైన పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు.. పట్టణ యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాల పెంపుపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. స్వచ్ఛత-శుభ్రతలో భాగంగా ప్రభుత్వం చేపట్టే పలు కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, స్వచ్ఛాంధ్ర : స్వర్ణాంధ్ర లక్ష్యసాధనకు సహకరించాలని ప్రత్తిపాటి సూచించారు. చిన్న పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందాలంటే, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల్లో ప్రజల భాగస్వామ్యం, ప్రోత్సాహం ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. మున్సిపాలిటీలఅభివృద్ధితోస్థానికులజీవన ప్రమాణాలు మెరుగుపడటమేగాక,ఉపాధిఅవకాశాలుపెరుగుదలతో ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ప్రత్తిపాటి శంకుస్థాపన చేసిన పలు అభివృద్ధి పనుల వివరాలు. 22వ వార్డు గాంధీపేట మున్సిపల్ ప్రైమరీ స్కూల్ వద్ద రూ.13 లక్షలతో వేయనున్న సీసీరోడ్డు, 24వ వార్డు సుబ్బయ్య తోట, బోస్ రోడ్డు సమీపంలో రూ.13 లక్షలతో వేయాల్సిన సీసీరోడ్డు, 28వ వార్డులోని మైనారిటీ ఖబరిస్తాన్ వద్ద రూ.17లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు మరియు ప్రహరీ నిర్మాణం, 29వ వార్డు మున్సిపల్ ఉర్దూ స్కూల్ వద్ద రూ.6 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులు,37వ వార్డు నాలుగో లైన్లో రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు,37వ వార్డు విజయ డిజిటల్ వద్ద రూ.8 లక్షలతో నిర్మించే మరో సీసీ రోడ్డు,38వ వార్డు వైఎస్సార్ కాలనీ సమీపాన రూ.15 లక్షలతో వీధిదీపాల ఏర్పాటు.శంకుస్థాపన కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, షేక్ మస్తాన్ వలి, కొత్త కోటేశ్వరరావు, పిల్లి కోటేశ్వరరావు, గోపిదేశి శివ, బ్రహ్మం, మస్తాన్ వలి, మసాలా సాంబయ్య, పోతురాజు, బాబావలి, కరిముల్లా, షేక్ కరిముల్లా, షేక్ సుభాని బుజ్జి, తలమాల విజయ్, పఠాన్ ఇమ్రాన్ ఖాన్, షేక్ బాని, నందం చంద్రశేఖర్, కరిముల్లా, కాలేశా, బేరింగ్ మౌలాలి , తోట బ్రాహ్మస్వాములు, జున్ను బుడే, జంగా వినాయకరావు, సుజాత, యదాల సుజాత, అరెకట్ల భూలక్ష్మి, తుబాటి మధు, పాములపాటి శివకుమారి, తుబాటి శ్రీహరి, మధు, తొండపు వెంకయ్య, కరణం విజయ, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో చిలకలూరిపేట విద్యార్థిని ప్రతిభాప్రభంజనం

## 400 మంది విద్యార్థులతో పోటీపడి ప్రథమ బహుమతి కైవసం

**చిలకలూరిపేట, పెన్ పవర్, అక్టోబర్ 10:**
విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో చిలకలూరిపేటకు చెందిన ఎస్.పి.టి.ఆర్.కె.ఎం. స్కూల్ విద్యార్థిని షేక్ అప్సర్ ప్రథమ బహుమతి సాధించి తన ప్రతిభను చాటుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో అందరినీ అధిగమించి మొదటి స్థానంలో నిలవడం విశేషం.చిత్రలేఖనంపై తనకున్న ఆసక్తి, సృజనాత్మక ఆలోచనలు, కళాత్మక నైపుణ్యంతో షేక్ అప్సర్ ఈ ఘనతను సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకోవడం ద్వారా తన పాఠశాలకు, తల్లిదండ్రులకు, చిలకలూరిపేట పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చింది.
విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. షేక్ అప్సర్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.400 మంది విద్యార్థులతో పోటీపడి ప్రథమ బహుమతి సాధించిన షేక్ అప్సర్ విజయం ఇతర



విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## విజయవాడ దుర్గమ్మ దివ్య దర్శనం టికెట్లు విడుదల



**పెన్ పవర్, అక్టోబర్ 10:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో రాబోయే దసరా శరన్నవరాత్రులకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు అత్యంత ఘనంగా మరియు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా భక్తుల సౌకర్యార్థం అక్టోబర్ 11, 12, 13 తేదీలకు సంబంధించిన రూ. 1,000 విలువైన ప్రత్యేక 'అమ్మవారి దివ్య దర్శనం' టికెట్లను రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 'మన మిత్ర' వాట్సాప్ సేవల ద్వారా పూర్తిగా డిజిటల్ పద్ధతిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ప్రత్యేక సేవలలో భాగంగా ఇంద్రకీలాద్రిలోని ఈవో కార్యాలయంలో దేవస్థాన ఈవో వి.కె. సీనా నాయక్ ఈ విశేష దర్శన టికెట్లను అధికారికంగా విడుదల చేశారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఈ ఆన్‌లైన్ వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకుని అమ్మవారిని దర్శించుకోవాలని దేవస్థాన అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## అక్టోబరు 11 నుంచి 20వ తేదీ వరకు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

**తిరుమల, పెన్ పవర్, అక్టోబర్ 10:**
తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో అక్టోబరు 11 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి 4.30 గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లు, ఇతర పండ్ల రసాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. అదేవిధంగా సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు.
అక్టోబరు 20వ తేదీ విజయదశమినాడు శ్రీపద్మావతి అమ్మవారు రాత్రి 7.45 గంటలకు విశేషమైన గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు.

**ఆర్జిత సేవలు రద్దు**
నవరాత్రి ఉత్సవాల కారణంగా ఈ 10 రోజుల పాటు కల్యాణోత్సవంను రద్దు చేయడమైనది. అదేవిధంగా, అక్టోబరు 16న లక్ష్మీపూజ సేవలు రద్దయ్యాయి.

# పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహల్లి





**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 10 :**
రానున్న స్థానిక ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహల్లి ఐపీఎస్ శనివారం చిలకలూరిపేట టౌన్, రూరల్, యడ్లపాడు, నాదెండ్ల పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ల పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డులను పరిశీలించిన ఆయన, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాఖపై నమ్మకాన్ని పెంపొందించేలా సేవలందించాలని, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలు, వార్డుల నుంచి క్షేత్రస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు, సీఐలు రమేష్, సుబ్బనాయుడు, ఎస్సైలు అనిల్, శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్.





**జగిత్యాల జిల్లా పెన్ పవర్, అక్టోబర్ 10 :**
జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్స్‌లో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి టోర్నమెంట్ మరియు సెలక్షన్స్--2026--27 కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అండర్--14, అండర్--17 బాలబాలికల బాక్సింగ్, తైక్వాండో,కరాటే పోటీలకు జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ హాజరైపోటీలనుప్రారంభించి,క్రీడాకారులనుఅభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు
జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జగిత్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు ఆకాంక్షించారు.సమయం అందరికీ సమానంగా ఉంటుంది అని దాన్ని సద్వినియోగం చేసుకున్న వారికి ఉత్తమ ఫలితాలు పొందుతారని అన్నారు.తెలంగాణ క్రీడాకారిణిలు ఆసియా క్రీడల్లో పాల్గొని పతాకాలు సాధించి ఒలంపిక్స్ కు అర్హత సాధించారని,రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కౌన్సిలర్ లు దుమాల రాజ్ కుమార్ ప్రశాంత్ రావు, జుంబర్తి రాజ్ కుమార్,టెక్నికల్ శ్రీను బాబు కరాటే చైర్మన్ లింగయ్య కరాటే ప్రధాన కార్యదర్శి అరుముల్ల పవన్ ఎస్ జి ఎఫ్ కార్యదర్శి చక్రధర్ రావు నల్ల నవీన్ సంతోష్ సంపత్ గోదావరిఖానీ శ్రీనివాస్ నాయకులు చందా పృథ్వీ ,శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పెత్రమాసం సందర్బంగా అమరవీరుల స్థూపానికి బియ్యం అందచేత.



**మహబూబాబాద్ జిల్లా పెన్ పవర్, అక్టోబర్ 10 :**
కేంద్రంలో పెత్ర మాసం సందర్భంగా చనిపోయిన పెద్దలను స్మరిస్తూ బియ్యం అందించే ఆచారంలో బాగంగా తెలంగాణ కోసం ఆత్మ బలిదానం చేసుకున్న 1400 వందల మంది అమరులను స్మరించుకుంటూ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపానికి బియ్యం అందజేసి అమరులకు జహోర్లు అర్పించిన తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. డోలి సత్యనారాయణ తదితరులు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు అమలు చేసినపుడే అమరులకునిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు మైస శ్రీనివాస్, పిల్లి సుధాకర్, శంతన్ రామరాజు, ఖాజాపాష, మైస నాగయ్య, కొండ బత్తుల ఈశ్వర్,



అక్కెర మోహన్ రావు, రమణయ్య,మామిడాల సత్యనారాయణ, బాలాష్టి రమేష్, కందగట్ల వెంకన్న,కృష్ణ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

# సుజాతనగర్ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు

**-రూ.8.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్..**
**-రూ.5 కోట్లతో సింగభూపాలెం చెరువు కట్ట అభివృద్ధి**




**సుజాతనగర్ మండల పెన్ పవర్, అక్టోబర్ 10 :**
సుజాతనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ 22వ డివిజన్‌లో రూ.8.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, సింగభూపాలెం చెరువు కట్ట అభివృద్ధికి రూ.5 కోట్లు, కొత్తగూడెం రింగ్ రోడ్డుకు రూ.500 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. బృందావనం సమీపంలో 18 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటుకు, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, ఇతర ప్రజాప్రతినిధులు, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక చైతన్యంతోనే... గొడ్డలిపార్టీ రాజకీయ ప్రస్థానానికి ముగింపు : ప్రత్తిపాటి

## ఐదేళ్లు బీసీల్ని అన్నివిధాల అణచివేసిన జగన్.. వైసీపీనేతలు, ఇప్పుడు వారి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది.

**నియోజకవర్గ బీసీ విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి.**



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 10 :**
బలహీనవర్గాలరాజకీయ,సామాజిక,ఆర్థికఎదుగుదలకు అతిపెద్దఅడ్డంకి,అవరోధంజగన్..వైసీపీయేనని, బీసీల్లో చైతన్యం.. ప్రశ్నించేతత్వం పెరిగినప్పుడే గొడ్డలిపార్టీ రాజకీయ ప్రస్థానం ముగుస్తుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ బి.సి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మద్దిబోయిన శివ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి బీసీల సమీక్ష సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడారు. టీడీపీ అధిష్టానం పార్టీ పరంగా అమలుచేయనున్న 34శాతం బీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తూ.. ప్రత్తిపాటి, నియోజకవర్గ బీసీ నేతలకు స్వయంగా స్వీట్లు తినిపించారు. అనంతరం ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు.34 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఇవ్వాలన్నదేముఖ్యమంత్రిఆలోచనచంద్రబాబుప్రకటించిన బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాడని, న్యాయస్థానాల్ని ఆశ్రయించి మరీ బలహీనవర్గాల రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్నాడని ప్రత్తిపాటి ఆక్షేపించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు, ఆపార్టీకే అండగా నిలుస్తున్నారన్నభావనజగన్‌మనసులోనాటుకుపోయిందని, ఆ దురుద్దేశంతోనే బలహీన వర్గాల్ని అన్ని విధాలా అణచివేస్తున్నాడన్నారు. 2019-24 మధ్య రాజ్యాంగబద్ధంగా బీసీలకు దక్కాల్సిన 16,800కు పైగా స్థానిక సంస్థల పదవుల్ని జగన్ వారికి దూరం చేశాడని ప్రత్తిపాటి తెలిపారు. తమకు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయం, మోసంపై ప్రశ్నించిన బీసీలను హతమార్చడానికి కూడా జగన్ వెనుకాడలేదన్నారు. జగన్.. వైసీపీ అడ్డుకోకుంటే, 34 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వపరంగానే అమలయ్యేవని, జీవోల ద్వారా కూటమి సర్కారు బీసీలకు న్యాయం చేసేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.40 రోజుల ఎన్నికల దీక్షలో.. విజయమే మన లక్ష్యం.అన్నిరకాలుగా బీసీల్ని బలోపేతం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, బలహీన వర్గాల్ని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న నమ్మకం టీడీపీ అధినేతకు ఉందని ప్రత్తిపాటి చెప్పారు. 34 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ప్రకటించాలన్నఆలోచనలో చంద్రబాబు ఉన్నారని, నేడో, రేపో ఆ ప్రకటన కూడా వెలువడే అవకాశముందన్నారు. 14న ఎన్నికల షెడ్యూల్, 15న నోటిఫికేషన్ వెలువడే అవకాశముందన్న ప్రత్తిపాటి. పట్టణంలోని అన్ని వార్డుల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించాలని, ఆ దిశగా మూడుపార్టీల శ్రేణులు క్షేత్రస్థాయి నుంచే పనిచేయాలన్నారు. మున్సిపాలిటీలతో పాటు.. పంచాయతీలు, మండలాలు, జడ్పీటీసీల్లోనూ కూటమి విజయ పరంపర కొనసాగాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, రెండున్నరేళ్లలోచేసిన అభివృద్ధిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 40 రోజుల ఎన్నికల దీక్ష తీసుకొని, విజయమే లక్ష్యంగా కూటమిశ్రేణులు నిబద్ధత, పట్టుదల, అంకితభావంతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు.సమీక్ష సమావేశంలో నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, కొత్త కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, బి.సి నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, ఆర్టీసీ కంచర్ల శ్రీనివాసరావు, తుపాకుల అప్పారావు, అవ్వారు లక్ష్మణ్, బ్రహ్మం , ఒంటిపల్లి వెంకట, అద్దంకి అనితా భాయి, నిమ్మకాయల ప్రసాద్, రంగనాథుల నాగేశ్వరరావు, రామాంజనేయులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ప్రత్తిపాటి

**-మానుకొండవారిపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి.**
**-పల్లెపండుగ 3.0లో భాగంగా యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన ప్రత్తిపాటి, మర్రెడ్డి.**





**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 10 :**
గత పాలకుల అసమర్థ పాలనతో నియోజకవర్గం అభివృద్ధికి దూరమైందని, చివరకు ప్రజలకు సురక్షితమైనతాగునీరు కూడా అందించలేకపోయారని, కూటమి ప్రభుత్వ కృషితో త్వరలోనే ప్రజలకు కృష్ణా జలాలు అందనున్నాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లో శనివారం ప్రత్తిపాటి పలు అభివృద్ధి పనుల ప్రారంభించి, మరికొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తొలుత యడ్లపాడు మండలం సందెపూడి ఎస్సీ కాలనీలో రూ.35 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం చిలకలూరిపేట మండలం వేలూరులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, పాఠశాల ప్రహరీలను ఇరువురు నాయకులు ప్రారంభించారు.అనంతరం రూ.40 లక్షలతో నిర్మించే సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చివరిగా మానుకొండవారిపాలెంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించి, అక్కడ ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు.

**ప్రజల తాగునీటి కష్టాలకు పరిష్కారం.. రూ.67 కోట్లతో 27 గ్రామాలకు కృష్ణా జలాలు.**

నియోజకవర్గ ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని, జల్ జీవన్ మిషన్ (జేజేఎమ్) లో భాగంగా తొలుత 27 గ్రామాలకు నాగార్జున సాగర్ నుంచి కృష్ణా జలాలను తరలించబోతున్నామని, ఇందుకోసం రూ.67 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రధాన సమస్యను పరిష్కరిస్తే, ప్రజలకు నీటి కష్టాలు తీరుతాయని, ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయనిఆయనతెలిపారు.
మానుకొండవారిపాలెం నాయకులు అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, ఒక సమస్య తీర్చిన వెంటనే మరోదాన్ని వెంటనే తనముందు పెడతారని ప్రత్తిపాటి చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పొలాలకు వెళ్లే రోడ్లకు కూడా మహర్దశ పట్టిందన్నారు.

**ప్రత్తిపాటి నాయకత్వంలో వేగవంతమైన అభివృద్ధి : మర్రెడ్డి.**

ప్రత్తిపాటి పుల్లారావు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతుల సంక్షేమానికి తీవ్రంగా కృషి చేశారని రాష్ట్ర వ్యవసాయ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల మేలు కోరే నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు అని, ఆయన నాయకత్వంలో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జలమే జీవమనే నానుడిని ప్రభుత్వం ఆచరణలో నిజం చేస్తోందని, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే దిశగా సాగుతోందని శ్రీనివాసరెడ్డి తెలిపారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దినేడి శివరామకృష్ణ, సుబ్బారావు, సీతారామయ్య, వేణు, ప్రభుదసు, రాజేష్, వీర రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, అధికారులు డి.ఈ అరునాధబాబు, ఏ.ఈ సూర్యతేజ, హరిబాబు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల పతక విజేతలతో వారణాసిలో సైకిల్ ర్యాలీ రేపు 94వ 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం

**న్యూఢిల్లీ, , పెన్ పవర్, అక్టోబర్ 10 :**
యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తూ, మాదకద్రవ్యాల రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా వారణాసిలో అక్టోబరు 11న 94వ 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం నిర్వహించనున్నారు. 'వికసిత్ భారత్ కోసం మాదకద్రవ్యాల రహిత యువత' ఇతివృత్తంతో ఉదయం 6 గంటల నుంచి నమో ఘాట్ నుంచి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయంలోని దీక్షా మండపం వరకు సైకిల్ ర్యాలీ జరగనుంది.కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. యువత, క్రీడాభిమానులు, ఫిట్‌నెస్ ఔత్సాహికులు, ప్రజలతోపాటు 2026 ఐచి--నగోయా ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.మహిళల 400 మీటర్ల పరుగులో కాంస్యం సాధించిన ప్రాచీ చౌధరి, మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్, 5000 మీటర్ల పరుగులో రెండు కాంస్య పతకాలు గెలుచుకున్న పారుల్ చౌధరి ర్యాలీలో పాల్గొననున్నారు. మిక్స్‌డ్ 4x400 మీటర్ల రిలేలో రజతం, పురుషుల 4x400 మీటర్ల రిలేలో కాంస్యం సాధించిన జయ్ కుమార్, భారత హాకీ జట్టులో సభ్యుడిగా స్వర్ణ పతకం అందుకున్న రాజ్ కుమార్ పాల్ కూడా హాజరుకానున్నారు. వీరి భాగస్వామ్యం యువతకు క్రమశిక్షణ, పట్టుదల, నిత్య సాధన ప్రాధాన్యాన్ని తెలియజేయనుంది.
నమో ఘాట్‌లో యోగా, జుంబా, సరదా ఆటలు, ఇతరభాగస్వామ్యకార్యక్రమాలనుఏర్పాటుచేయనున్నారు.




సైక్లింగ్,నడక,శారీరకవ్యాయామాన్ని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని ఈ కార్యక్రమంద్వారా ప్రజలకు పిలుపునివ్వనున్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడంలో కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం, క్రీడాకారుల సమష్టి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించనున్నారు.
కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత సైక్లింగ్ సమాఖ్య, రాహ్‌గిరి ఫౌండేషన్, 'మై భారత్' సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో భారత క్రీడా ప్రాధికార సంస్థ కేంద్రాలు, ఖేలో ఇండియా కేంద్రాల్లోనూ సైక్లింగ్ కార్యక్రమాలు ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 6 వేలకు పైగా నమో ఫిట్ ఇండియా క్లబ్‌లు ప్రతి వారం ఈ ఉద్యమంలో భాగస్వామ్యమవుతున్నాయి.

# బాబు పవన్ విజయ్ ఒకే ఫ్రేమ్...ఏపీకి తమిళ సీఎం !



**విజయవాడ, అక్టోబరు 11 : పెన్ పవర్:** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత విజయ్ తొలిసారి ఏపీకి అధికార పర్యటనకు వస్తున్నారు. ఆయన ఈ నెల 13న విజయవాడ టూర్ ఫిక్స్ అయిందని అంటున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో భేటీ అవుతారు అని తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు గంగ ఒప్పందం గురించి ఆయన కూటమి ప్రభుత్వంలో చర్చిస్తారు అని అంటున్నారు. అలాగే కృష్ణా జలాల వాటా గురించి చర్చ కూడా ఈ భేటీలో జరగనుంది అని అంటున్నారు.

**జల వివాదాలే అజెండా :**

ఏపీకి తమిళనాడుకు మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించుకునే నిమిత్తం విజయ్ ఏపీకి వస్తున్నారు అని అంటున్నారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ ద్వారా తమిళనాడుకు నీటిని సరఫరా చేసే ఒప్పందం గతంలో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏపీ నుంచి ప్రతీ ఏడాది 12 టీఎంసీల క్రిష్ణా జలాల నీటిని తమిళనాడుకు అందించాల్సి ఉంది. అయితే ఆ ఒప్పందం సక్రమంగా అమలు కావడం లేదన్నది తమిళనాడు అభ్యంతరంగా ఉంది. ఈ ఏడాది చూస్తే అక్టోబర్ 9 నాటికి కేవలం 2.251 టీఎంసీల నీరు మాత్రమే అందిందని చెబుతున్నారు. ఇంకా 9.749 టీఎంసీల నీరు తమిళనాడుకు సరఫరా కావాల్సి ఉంది. దాంతో తమకు ఒప్పందం మేరకు రావాల్సిన పూర్తి వాటా 12 టీఎంసీల నీటి కోసం తమిళ సీఎం విజయ్ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చిస్తారు అని అంటున్నారు.

**డ్యాముల నిర్మాణం మీద :**

అంతే కాకుండా ఏపీ నుంచి తమిళనాడులోకి ప్రవహించే నదుల మీద ఏపీ ప్రభుత్వం డ్యాముల నిర్మాణం చేసేందుకు సిద్ధపడుతోంది అన్న దానిమీద కూడా తమిళనాడు ప్రభుత్వం అభ్యంతరం తెలియచేస్తోంది. ఈ విషయం మీద ముఖా ముఖీ చర్చల ద్వారా ఏపీ ప్రభుత్వంతో ఒక పరిష్కారం కనుగొనాలని విజయ్ చూస్తున్నారు అని అంటున్నారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు తరచూ ఒక మాట అంటున్నారు. కేంద్రం వద్ద కూడా ప్రతిపాదిస్తున్నారు. అదే నదుల అనుసంధానం. గోదావరి కావేరి సహా దక్షిణాది నదులు అన్నీ కూడా ఏకీకృతం చేస్తే కనుక దక్షిణాదిన అతి పెద్ద వాటర్ గ్రిడ్ ఏర్పడుతుందని శాశ్వతంగా అన్ని రాష్ట్రాలకు నీటి కొరత తీరుతుందని కూడా బాబు చెబుతున్నారు. దీని మీద కూడా విజయ్ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చిస్తారు అని అంటున్నారు. ఏపీ తమిళనాడు ముఖ్యమంత్రుల మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరుగుతుందని ఈ సందర్భంగా అనేక అంతర రాష్ట్ర సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అని భావిస్తున్నారు. అంతే కాదు రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వైఖరితో పాటు మంచి సంబంధాలు నెలకొనేందుకు ఆస్కారం ఉంటుందని అంటున్నారు.

**పవన్ తో తొలిసారి :**

ఇదిలా ఉంటే ఏపీకి వస్తున్న విజయ్ ఉప ముఖ్యమంత్రి పవన్ తో తొలి భేటీ వేస్తారు అని అంటున్నారు. చంద్రబాబు ఈ మధ్య దక్షిణాది రాష్ట్రాల సమావేశం చెన్నైలో జరిగినపుడు వెళ్ళారు. అక్కడ అలా విజయ్ ని ఆయన కలుసుకున్నారు. పవన్ తో విజయ్ భేటీ అయితే జరగలేదు. దాంతో ఈసారి ఈ ఇద్దరూ కలిసి ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తారు అని అంటున్నారు. ఈ ఇద్దరికీ ఒక పోలిక ఉంది. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి ఒకరు ముఖ్యమంత్రిగా మరొకరు ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. దాంతో ఈ నెల 13న విజయ్ జరిపే అధికారిక పర్యటన మీద అందరి కళ్లూ ఉన్నాయి.

# జగన్ కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులో అనూహ్య నిర్ణయం, రాజకీయం మారుతున్న సంకేతమా?



**విజయవాడ, అక్టోబరు 11 : పెన్ పవర్:** ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డికి ఎన్ఫోర్సుమెంటు డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. జగన్ పై నమోదైన అక్రమాస్తుల కేసులను రోజువారిగా విచారించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పదేళ్లుగా విచారణకు నోచుకోవడం లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. జగన్ తోపాటు నిందితులు అంతా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యేలా ఆదేశించాలని ఈడీ తన పిటిషన్ లో పేర్కొందని చెబుతున్నారు. సీబీఐ కోర్టులో 9 పిటిషన్లు పదేళ్లుగా పెండింగులో ఉన్నాయని ఈడీ తన పిటిషన్ లో పేర్కొంది. సీబీఐ కోర్టులో డిశ్చార్జి పిటిషన్లు తేలకపోవడంతో విచారణ ముందుకు కదలడం లేదని తెలిపింది. ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక ఆరోగ్యానికి హానికరమని ఈడీ పేర్కొంది.

**అనూహ్య నిర్ణయం**

పదేళ్లుగా విచారణకు నోచుకోని కేసుల విషయంలో ఈడీ దాఖలు చేసిన పిటిషన్ తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. సాధారణ న్యాయ ప్రక్రియలో భాగంగానే ఈడీ ఈ నిర్ణయం తీసుకుందా? లేక ఏమైనా రాజకీయ ప్రోద్బలం ఉందా? అన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జగన్ అనుచిత లేదా అయాచిత లబ్ధి పొందారని సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో జగన్ రెడ్డి జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటూ బెయిలుపై బయటకు వచ్చారు. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రిగా పనిచేశారు. జగన్ సీఎం అయిన తర్వాత ఆయనపై నమోదైన కేసుల విచారణ అటకెక్కిందని రాజకీయ ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈడీ అనూహ్యంగా పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని కోర్టుకు వెళ్లడం హాట్ టాపిక్ అవుతోంది.

**బీజేపీ ఆలోచన మారిందా?**

జగన్ రెడ్డికి వ్యతిరేకంగా ఈడీ తీసుకున్న నిర్ణయం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఈ నిర్ణయం రాజకీయాల్లో మార్పు,చేర్పులకు సంకేతమా? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం బలంగా ఉండటం, కూటమిలో కీలక భాగస్వామ్య పక్షాలు అయిన టీడీపీ, జనసేన అధినేతలు మాజీసీఎం అక్రమాస్తుల కేసుల విషయంలో సీరియస్ గా ఉండటం వల్లే ఈడీ తాజా నిర్ణయం తీసుకుని ఉంటుందని భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరించేవారని, జగన్ రెడ్డితో ఉన్న రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం కూడా అప్పట్లో ఆయనపై నమోదైన కేసులను తొక్కిపెట్టిందని విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే ఇప్పుడు రాజకీయం మారడం, జగన్ ఇండి కూటమి వైపు చూస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో తాజా నిర్ణయం హీట్ పుట్టిస్తోందని అంటున్నారు.

**వరుసగా ఈడీ అటాక్**

విపక్షం వైసీపీ లక్ష్యంగా ఇటీవల చోటుచేసుకున్న ఈడీ దాడులు, అరెస్టులే హాట్ టాపిక్ అవుతున్నాయి. ఇలాంటి సమయంలో ఏకంగా వైసీపీ అధినేత జగన్ రెడ్డికి వ్యతిరేకంగా ఈడీ పిటిషన్ దాఖలు చేయడం రాజకీయాన్ని మరింత వేడెక్కిస్తోందని అంటున్నారు. మద్యం కుంభకోణంతోపాటు మద్యం రవాణాలోనూ కుంభకోణం జరిగిందని, విదేశాలకు నిధులు మళ్లించారని వైసీపీ నేతలు రాజ్ కేసిరెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ ను ఈడీ అరెస్టు చేసింది. అదే సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను అరెస్టు చేసి జైలుకు పంపింది. అంతేకాకుండా మాజీ మంత్రి అంబటి రాంబాబుకు నోటీసులు జారీ చేసింది. గతంలో ఎన్నడూ లేనట్లు ఏపీకి చెందిన కేసులపై ఈడీ దూకుడు పెంచడమే అనేక అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. ఈ పరిస్థితిని మరింతగా వేడెక్కించేలా తాజాగా జగన్ రెడ్డి కేసుల విషయంలో ఈడీ హైకోర్టుకు వెళ్లడం చర్చకు తావిస్తోంది.

# ఏమయ్యా బాలరాజు.. నీవల్ల జనసేనకు ఏం ప్రయోజనం?



**విజయవాడ, అక్టోబరు 11 : పెన్ పవర్:** “ఏమిరా బాలరాజు... ఏమిరా నీవల్ల దేశానికి ఉపయోగం?” ఇది ఓ తెలుగు సినిమాలో పాపులర్ డైలాగ్. కానీ, ఇప్పుడు ఇదే డైలాగ్ ను కాస్త మార్చి రాసుకోవాల్సివస్తోంది. అవును, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వైఖరితో జనసేన పార్టీ తీవ్రంగా మదనపడుతోంది. ఎన్నికైన తొలి నెల నుంచే ఎమ్మెల్యేపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తున్నాయని అంటున్నారు. తాజాగా ఆయన వ్యవహారశైలిపై మరోసారి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జనసేన అధిష్టానం సీరియస్ అయిందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యేపై వచ్చిన ఫిర్యాదుల పరిశీలనకు పార్టీ పరంగా హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన పార్టీ ఓ ప్రకటనలో తెలిసింది.

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వ్యవహారశైలి తొలి నుంచి వివాదాస్పదంగానే ఉందని జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. ఆయన కారణంగా నియోజకవర్గంలో పార్టీ రెండుగా చీలిపోయిందనే టాక్ వినిపిస్తోంది. నియోజకవర్గంలో ఆయన కుటుంబ సభ్యుల పెత్తనం, గతంలో ఈ ఆరోపణలపై పార్టీ అధిష్టానం వివరణ తీసుకున్నా ఆయన వైఖరిలో మార్పు రాలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేపై విచారణకు ఆదేశించినట్లు చెబుతున్నారు.

**పవన్ సీరియస్**

నీతి, నిజాయితీతో పార్టీని నడపాలని భావిస్తున్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు సొంత పార్టీ ఎమ్మెల్యేలపై వస్తున్న ఫిర్యాదులు తలనొప్పిగా మారుతున్నాయని అంటున్నారు. పద్ధతిగా నడుచుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని పదేపదే చెబుతున్నా, పార్టీ ఎమ్మెల్యేలు మాట వినడం లేదని పవన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నారు. ఇక పోలవరం ఎమ్మెల్యే బాలరాజు వ్యవహార శైలిపై పవన్ పూర్తి అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణలు, క్యాడర్ ను విస్మరించడం, కుటుంబ వివాదాలు రచ్చకెక్కడాన్ని పవన తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ వివాదాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించేందుకు ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాలరాజుపై చర్యలు ఉంటాయని అంటున్నారు.

**క్యాడర్ లో తీవ్ర అసంతృప్తి**

ఎమ్మెల్యే బాలరాజు వైఖరిపై జనసేన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పార్టీ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన విజయం కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకులను విస్మరించి కొత్తగా వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని సీనియర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. పార్టీలో ప్రభుత్వ వ్యవహారాల్లో ఎమ్మెల్యే బంధువులపైనా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని చెబుతున్నారు. దీంతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుకూల వర్గం, వ్యతిరేక వర్గం అన్నవిధంగా పార్టీ చీలిపోయిందని అంటున్నారు. పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజి కింద గిరిజనేతులకు ప్రభుత్వం కేటాయించే భూముల్లో ఎమ్మెల్యే అనుచరులు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు పత్రికల్లో కథనాలు రావడంపైనా పార్టీ సీరియస్ అయిందని అంటున్నారు. మొత్తంగా ఎమ్మెల్యేగా బాలరాజు గెలిచిన 28 నెలల్లో ఆయన వల్ల పార్టీకి ఎక్కువగా నష్టమే జరిగిందని అంటున్నారు. దీంతో ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# బ్యాలెట్ తో ఎన్నికలు



**విజయవాడ, అక్టోబరు 11 : పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. విజయవాడ వేదికగా పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను స్పష్టం చేశారు. ఈ దఫా స్థానిక సమరాన్ని బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా అధికారికంగా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని, ఎన్నికల నిర్వహణకు కమిషన్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎస్ఈసీ ప్రకటన చేశారు. 2026 ఫిబ్రవరి నాటికి సిద్ధమయిన తుది ఓటర్ల జాబితానే ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పునేఠా ప్రకటించారు. అర్హులైన కొత్త ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా పకడ్బందీగా ఈ లిస్టులను రూపొందించాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల పునర్విభజన ప్రక్రియను ఎటువంటి తప్పిదాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు, ఇతర అంశాలపై సుప్రీంకోర్టులో నడుస్తున్న న్యాయపరమైన ప్రక్రియను కమిషన్ నిశితంగా పరిశీలిస్తోందని ఎస్ఈసీ తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి తుది తీర్పు , స్పష్టమైన ఆదేశాలు వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా బలగాల మోహరింపును దృష్టిలో ఉంచుకుని స్థానిక పోరును ఏకకాలంలో కాకుండా విడతల వారీగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల దశలను పక్కా ప్రణాళికతో చేపట్టేలా కసరత్తు చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల సమీక్షలో ఎన్నికల ఏర్పాట్లు, నిధుల సమీకరణ, సిబ్బంది శిక్షణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికార యంత్రాంగం నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ప్రక్రియ చట్టబద్ధంగా సాగేలా గట్టి నిఘా ఉంచాలని పునేఠా స్పష్టం చేశారు. న్యాయస్థానం వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడమే తరువాయి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించడంతో వచ్చే రెండు, మూడు నెలలు స్థానిక ఎన్నికల హంగామా కనిపించనుంది.

# 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగం

**తిరుపతి అక్టోబరు 11: పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలు, నగరాల్లో వ్యాపారాలు, నివాస గృహాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల ప్రక్రియలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత నిబంధనలు తెస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కామన్ జోనింగ్ రెగ్యులేషన్స్-2026 ను అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న సంక్లిష్టమైన విభిన్న జోనింగ్ నిబంధనలను రద్దు చేసి, ఆధునిక అవసరాలకు తగినట్లుగా కేవలం 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగాన్ని క్రమబద్ధీకరించారు. ఈ నూతన విధానంలో అత్యంత కీలకమైన అంశం నెగిటివ్ లిస్ట్ విధానాన్ని ప్రవేశపెట్టడం. గతంలో ఒక నిర్దిష్ట భూమిలో ఏ నిర్మాణానికి అనుమతి ఉందో తెలుసుకోవడానికి పౌరులు, డెవలపర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు నెగిటివ్ లిస్ట్ ద్వారా సదరు జోన్‌లో ఖచ్చితం ప్రోహిబిటెడ్ కార్యకలాపాలు మినహా, మిగిలిన అనుకూల ప్రాజెక్టులన్నింటికీ ఆటోమేటిక్‌గా అనుమతులు లభించే వీలుంది. ఈ పారదర్శక విధానం వల్ల అధికారులు నిబంధనల పేరుతో చేసే అనవసర ఆటంకాలకు, అవినీతికి శాశ్వత చెక్ పడనుంది. ఈ కొత్త జోనింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఇటీవలే సమగ్రంగా సవరించిన ‘ఏపీ బిల్డింగ్ రూల్స్’ను కూడా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 24 మీటర్లు , అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను ‘హైరైజ్’ భవనాలుగా పరిగణిస్తూ, వాటికి అవసరమైన ఫైర్, పర్యావరణ అనుమతులను డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒకే గొడుగు కిందకు తెచ్చారు. అంతేకాకుండా, పెద్ద నివాస, వాణిజ్య కాంప్లెక్స్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు, 50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న ఆఫీసుల్లో పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని నిబంధనల్లో భాగం చేశారు. ఈ జోనింగ్ సంస్కరణల వల్ల గృహ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపిరి అందడమే కాకుండా, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మరింత మెరుగవుతుంది. సుదీర్ఘకాలంగా మాస్టర్ ప్లాన్లు, భూ వినియోగ మార్పిడుల వివాదాల్లో చిక్కుకున్న భూములకు స్పష్టత రావడంతో రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తి వ్యాపారం, మౌలిక వసతుల కల్పన వేగవంతం కానున్నాయి

# అరకుకు చిన్న శ్రీను...కుమార్తెకు టికెట్ ?

**విజయవాడ, అక్టోబరు 11 : పెన్ పవర్:** కాంగ్రెస్ వైసీపీలలో దశాబ్దాల పాటు పనిచేసి ఆల్ ఆఫ్ సడెన్ గా టీడీపీలోకి వెళ్ళిన సీనియర్ నాయకుడు, విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చిన్న శ్రీనుకు టీడీపీ అధినాయకత్వం కీలక పదవిని ఇచ్చింది. ఆయనను అరకు పార్లమెంట్ టీడీపీ పరిశీలకుడిగా నియమించింది. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన పార్టీని అక్కడ పటిష్టం చేయడం నాయకత్వాన్ని కో ఆర్డినేట్ చేసుకుంటూ విజయం దిశగా నడిపించడం కోసం ఈ బాధ్యతలు అప్పగించారు అని అంటున్నారు. అరకు పార్లమెంట్ పరిధిలో పాడేరు, అరకు, సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో చాలా వరకూ ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఉండడంతో చిన్న శ్రీను రాజకీయ అనుభవం దృష్ట్యా ఈ బాధ్యతలు అప్పగించారు అని అంటున్నారు.

**హర్షం వ్యక్తం అయినా :**

ఇదిలా ఉంటే చిన్న శ్రీనుకు టీడీపీలో చేరిన నెల రోజులకే ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో పరిశీలకుడి బాధ్యత అంటే కీలకమే కాదు గౌరవంగా అనుచరులు భావిస్తున్నారు. టీడీపీలో తమ నాయకుడికి తగిన గుర్తింపు దక్కిందని వారు అంటున్నారు. అయితే విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా చిన్న శ్రీనుని నియమిస్తారు అని అంతా భావించారు. కానీ ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ దశలో నాయకత్వం మార్పు అన్నది చేయకుండా తగిన సమయంలోనే నిర్ణయాలు తీసుకుంటారు అని అంటున్నారు. అదే విధంగా చిన్న శ్రీను సేవలను పార్టీ ఉపయోగించుకుంటుంది అనడానికి నిదర్శనంగా ఆయనకు దక్కిన పదవి అని గుర్తు చేస్తున్నారు. అయితే చిన్న శ్రీను వరకూ బాగానే ఉన్నా విజయనగరం జిల్లాలో పార్టీలో ఆయన ప్రభావం ఎంత ఆయన వెంట వచ్చిన అనుచరులకు ఏ విధంగా అకామిడేషన్ కల్పిస్తారు, అన్నింటికీ మించి ఆయన వారసురాలు అయిన కుమార్తెకి టికెట్ దక్కుతుందా లేదా అన్న చర్చ అయితే సాగుతోంది.

**రెండు చోట్ల పోటీ :**

ఇక విజయనగరం కార్పొరేషన్ మేయర్ పదవి కోసం జనసేన గట్టిగా ప్రయత్నం చేస్తోంది. పొత్తులో భాగంగా కేటాయిస్తారు అని ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. మరో వైపు చూస్తే మేయర్ జనసేనకు పోతే టీడీపీకి జిల్లా పరిషత్ పీఠం ఉంటుందని అంటున్నారు. ఈ పీఠం కోసం కూడా పలువురు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో ఎవరికి ఈ అభ్యర్ధిత్వం దక్కుతుందన్నది చర్చగా ఉంది. మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు తన వారసుడి కోసం ఈ పదవి మీద ఫోకస్ పెట్టారు అని అంటున్నారు. అలాగే పలువురు సీనియర్ నేతల దృష్టి కూడా ఉంది. మరి చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర కూడా ఈ పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు అని అంటున్నారు. మరి ఆమెకు టికెట్ ఇస్తారా లేదా అన్నదే ఇపుడు హాట్ టాపిక్ గా ఉంది.

**సముచిత స్థానం :**

అయితే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి చాలా ముఖ్యం. కూటమి నూరు శాతం స్ట్రైక్ రేటు తో సక్సెస్ కొట్టాలని చూస్తోంది. అసంతృప్తులకు తావు లేకుండా మూడు పార్టీలు ముందుకు సాగాలని అనుకుంటున్నాయి. దాంతో మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారని అంటున్నారు. ఇక టీడీపీలో చేరిన చిన్న శ్రీను బృందానికి కూడా సముచిత స్థానం ఉంటుందని అంటున్నారు. అందుకే చిన్న శ్రీనుకు పదవి ఇచ్చారని చెబుతున్నారు. దాంతో ఆయన కుమార్తె పోటీ చేస్తారా లేదా అన్నది అయితే చర్చగా ఉన్నా కొద్ది రోజులలో జవాబు వస్తుందని అంటున్నారు.

# ఆ ఓటమిని ఇంకా మర్చిపోలేదు.. 2023 వరల్డ్ కప్ ఫైనల్‌పై రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు



భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత నరకం చూపించిన క్షణాల్లో 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఓటమి ఒకటి.. సొంతగడ్డపై వరుసగా 10 మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లిన టీమిండియా.. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలై కోట్లాది మంది భారతీయుల కలలను భంగ్నం చేసుకుంది. ఆ ఘోర ఓటమిపై ఇండియన్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తాజాగా తన మనసులోని ఆవేదనను, ఆ ఓటమి అందించిన గుణపాఠాన్ని షేర్ చేసుకున్నాడు. తన టీవీ షో ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ లో మాట్లాడిన హిట్ మ్యాన్.. ఆనాటి చేదు జ్ఞాపకాలు, ఆ తర్వాత టీ20 ప్రపంచకప్ 2024 విజయం వెనుక ఉన్న అసలు సీక్రెట్‌ను బయటపెట్టాడు. రోహిత్ శర్మ మాట్లాడుతూ.. 2023 నవంబర్ 19న ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ ఓటమి తన సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లోనే అత్యంత కష్టమైన దశ అని పేర్కొన్నాడు. 2007లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు 19 ఏళ్ల కాలంలో ఇలాంటి సమయాన్ని నేను ఎప్పుడూ చూడలేదు.. 2012 శ్రీలంక పర్యటనలో నేను ఘోరంగా విఫలమైనప్పుడు తీవ్రంగా ఫ్రస్ట్రేట్ అయ్యాను.. కానీ అది నా వ్యక్తిగత లక్ష్యం, కానీ నవంబర్ 19న జరిగింది నా ఒక్కడి లక్ష్యం కాదు, ఒక దేశం మొత్తం ప్రపంచకప్ కల నెరవేరాలని ఎదురుచూసిందని అతడు భావోద్వేగానికి గురయ్యాడు. టోర్నీ అంతటా తాము ఆడిన తీరు చూస్తే ఎక్కడా ఓడిపోతామని అనుకోలేదని, కానీ క్రీడలు నేర్పే గొప్ప పాఠం ఇదేనని రోహిత్ వ్యాఖ్యానించాడు.

**నవంబర్ 19 ఓటమే 2024 టీ20 ప్రపంచకప్‌కు పునాది:**

ఆనాటి పరాజయం జట్టును కుంగదీసినప్పటికీ, ఆటగాళ్లలో సరికొత్త కసిని, ఆకలిని పెంచిందని రోహిత్ శర్మ వెల్లడించారు. ఒకవేళ నవంబర్ 19వ తేదీన మేము ఆ ఓటమిని చవిచూడకపోతే.. 2024 టీ20 ప్రపంచకప్ గెలవాలనే కసి, ఆకలి మాలో ఉండేవి కావు.. విజయం కంటే వైఫల్యాలే మనిషికి ఎక్కువ పాఠాలు నేర్పుతాయని తెలిపాడు. వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జరిగిన 2024 టీ20 ప్రపంచకప్‌కు వెళ్లిన సమయంలో ఆటగాళ్లందరిలోనూ ఒక విభిన్నమైన ఎనర్జీ, ఎలాగైనా కప్ సాధించాలనే తపన కనిపించిందని గుర్తు చేసుకున్నారు.

**ప్రతి నవంబర్ 19కి.. ఒక జూన్ 29 ఉంటుంది:**

11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, జూన్ 29వ తేదీన బార్బడోస్ వేదికగా సౌతాఫ్రికాను ఓడించి భారత్ టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ ప్రయాణాన్ని రోహిత్ శర్మ ఒక అద్భుతమైన కోట్‌తో ముగించారు. ప్రతి నవంబర్ 19కి పరిహారంగా కచ్చితంగా ఒక జూన్ 29 వస్తుందని (ఖీశీతీ వజవతీఎ చీశీజవఎఎవతీ 19,  ్ష్ట్రవతీవ అం ఖ జీబఅవ 29) వెల్లడించాడు. నవంబర్ 19 నాటి గాయం తీవ్రమైనదే అయినప్పటికీ.. మళ్లీ భారత్‌ను ప్రపంచ క్రికెట్ శిఖరాగ్రాన నిలబెట్టేందుకు ఆ ఓటమి ఒక బలమైన ఇంధనంగా పని చేసిందని రోహిత్ శర్మ తేల్చి చెప్పాడు.

# 'మళ్లీ భారత్‌కు ఆడకపోయినా నాకేం నష్టం లేదు'.. షమీ సంచలన వ్యాఖ్యలు!

టీమిండియాలో చోటుపై షమీ కీలక వ్యాఖ్యలు

భువనేశ్వర్ ఎంపికపై తనకు అభ్యంతరం లేదని వెల్లడి

ప్రస్తుతం రంజీ ట్రోఫీపైనే దృష్టి పెట్టానని వెల్లడి

బెంగాల్ తరఫున ఫిట్‌నెస్ నిరూపించుకున్నానని వ్యాఖ్య

అయినా రెండుమూడేళ్లుగా జాతీయ జట్టులో అవకాశం రావడం లేదని వ్యాఖ్య



టీమిండియాలో చోటు దక్కకపోవడంపై సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ కీలక వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టుకు మళ్లీ ఆడే అవకాశం రాకపోతే అది తనకు నష్టం కాదని స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టినట్లు తెలిపాడు.న్యూజిలాండ్ పర్యటనకు భారత టీ20 జట్టును ప్రకటించిన సెలెక్టర్లు.. నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్ కుమార్‌కు అవకాశం ఇచ్చారు. అయితే షమీకి మాత్రం చోటు దక్కలేదు. 2023 వన్డే ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో కీలక పాత్ర పోషించిన షమీ.. చివరిసారిగా 2025 మార్చిలో భారత్ తరఫున ఆడాడు. గాయాల నుంచి కోలుకుని దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా జాతీయ జట్టులోకి ఎంపిక కావడం లేదు.భువనేశ్వర్‌కు అవకాశం రావడంపై స్పందించిన షమీ.. అతడికి మంచి అవకాశం దక్కిందని చెప్పాడు. అయితే అతడి ఎంపికతో తనకు సంబంధం లేదన్నాడు. ఎక్కడ ఆడే అవకాశం వచ్చినా తన అత్యుత్తమ ప్రదర్శన ఇస్తానని తెలిపాడు. ప్రస్తుతం రంజీ ట్రోఫీ మ్యాచ్‌పైనే తన దృష్టి ఉందని చెప్పాడు. గత రెండుమూడేళ్లుగా బాగా ఆడుతున్నా.. బెంగాల్ తరఫున తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నా.. భారత జట్టులో చోటు దక్కడం లేదని పేర్కొన్నాడు.మరోవైపు, భారత మాజీ క్రికెటర్ వసీం జాఫర్ షమీకి మద్దతుగా నిలిచాడు. అతడిని టెస్టు, వన్డే జట్లలోకి తీసుకోవాలని సూచించాడు. ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ షమీ లాంటి నాణ్యమైన బౌలర్‌ను పక్కనపెట్టడం సరికాదన్నాడు. బుమ్రా, షమీ, సిరాజ్ తన తొలి ఎంపికలని చెప్పాడు. టెస్టు జట్టులో షమీ పునరాగమనాన్ని చాలాకాలంగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. మరోసారి అతడికి అవకాశం దక్కకపోతే భారత జట్టులోకి తిరిగొచ్చే మార్గం మూసుకుపోవచ్చని అభిప్రాయపడ్డాడు.

# క్రికెట్ ఫ్యాన్స్‌కు పండగ.. భారత్‌లో జరగనున్న బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ టికెట్లు వచ్చేశాయ్!



క్రికెట్ అభిమానులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'బిగ్ బాష్ లీగ్' (బీబీఎల్) తొలిసారిగా భారత్‌లో అడుగుపెడుతోంది. బీబీఎల్ 16వ సీజన్ ఆరంభ మ్యాచ్‌కు చెన్నైలోని ప్రఖ్యాత ఎంఏ చిదంబరం స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. డిసెంబర్ 12న మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య జరగనున్న ఈ చారిత్రక మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల అమ్మకాలు ఇవాళ్టి నుంచి ప్రారంభమయ్యాయి.భారత్‌లోని అభిమానుల కోసం 'డిస్ట్రిక్ట్ బై జొమాటో' వెబ్‌సైట్‌లో తొలి విడత టికెట్లను అందుబాటులో ఉంచారు. రానున్న రోజుల్లో మరిన్ని టికెట్లను విడుదల చేయనున్నారు. ఆస్ట్రేలియా నుంచి వచ్చే అభిమానుల కోసం 'క్రికెట్ ఆస్ట్రేలియా ట్రావెల్ ఆఫీస్' (సీఏటీఓ) ప్రత్యేకంగా అంతర్జాతీయ ట్రావెల్ ప్యాకేజీలను కూడా ప్రకటించింది. ఇందులో మ్యాచ్ టికెట్లు, బీబీఎల్ మర్చండైజ్‌తో పాటు 4 లేదా 12 రోజుల పర్యటన వివరాలు ఉన్నాయి.గత మే నెలలో చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన ఐపీఎల్ 2026 మ్యాచ్ కోసం ఐదుగురు సభ్యుల క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రతినిధి బృందం చెన్నైకి వచ్చింది. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌తో కలిసి వారు మ్యాచ్‌ను వీక్షించారు. ఆ పర్యటన సందర్భంగా బీబీఎల్ ఆరంభ మ్యాచ్‌ను చెన్నైలో నిర్వహించాలని సీఏ ప్రతిపాదించగా, బీసీసీఐ అంగీకరించింది. కాగా, పెర్త్ స్కార్చర్స్ జట్టు బీబీఎల్ లో అత్యధికంగా ఆరుసార్లు టైటిల్ గెలిచి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది.ఈ చారిత్రక మ్యాచ్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా బిగ్ బాష్ లీగ్స్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ అలిస్టర్ డాబ్సన్ మాట్లాడుతూ.. "కిక్కిరిసిన స్టేడియం మధ్య జరిగే మ్యాచే బీబీఎల్ కు అసలైన అందం. ఆ అనుభూతిని చెన్నై అభిమానులకు అందించబోతున్నాం. బ్యాటర్ల విధ్వంసం, మైదానంలో నాటకీయత, ప్రపంచ స్థాయి వినోదంతో అభిమానులకు ఇదొక ప్రత్యేకమైన అనుభవాన్ని ఇస్తుంది" అని అన్నారు.భారత్‌లో ఈ మ్యాచ్‌కు అద్భుతమైన డిమాండ్ ఉందని, డిసెంబర్ 12న స్టేడియం పూర్తిగా నిండిపోతుందని అంచనా వేస్తున్నట్లు డాబ్సన్ తెలిపారు. ఆస్ట్రేలియా అభిమానులు కూడా ఈ చారిత్రక క్షణంలో భాగం కావాలని, ఇదొక జీవితంలో ఒక్కసారే వచ్చే అవకాశమని ఆయన పిలుపునిచ్చారు. ఈ మ్యాచ్‌ను ఆస్ట్రేలియాలో సెవెన్ నెట్‌వర్క్, ఫాక్స్ క్రికెట్ ప్రసారం చేయనుండగా, భారత్‌లోని కోట్లాది మంది అభిమానుల కోసం జియోస్టార్ ప్రత్యక్ష ప్రసారం అందించనుంది.

# గ్లామర్ ప్రపంచంలో రాణిస్తున్న టాప్ -10 తెలుగమ్మాయిలు







గ్లామర్ రంగంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని వరుస చిత్రాలతో దూసుకుపోతున్న టాప్ తెలుగమ్మాయిలు తమ అద్భుతమైన ప్రతిభతో మైమరిపిస్తున్నారు. -బేబీ- చిత్రంతో భారీ విజయాన్ని అందుకుని ఒక్కసారిగా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన వైష్ణవి చైతన్య.. తన సహజమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల ఆనంద్ దేవరకొండ సరసన నటించిన -ఎపిక్- చిత్రంతో మరోసారి నటిగా మంచి మార్కులే వేయించుకుంది. అలాగే -జాతిరత్నాలు- చిత్రంతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన ఫరియా అబ్దుల్లా తన హైట్.. ఎనర్జిటిక్ డ్యాన్సులు.. కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగా.. తాజాగా -గాయపడ్డ సింహం- వంటి చిత్రాలతో విభిన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు.గ్లామర్ రోల్స్ తో పాటు యాక్షన్ ప్యాక్డ్ పాత్రలతోనూ ఆకట్టుకుంటున్న డింపుల్ హయతి, -ఖిలాడి-, -సామాన్యుడు-వంటి చిత్రాలలో తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇటీవల కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన -భర్త మహాశయులకు విజ్ఞప్తి- చిత్రంతో తన నటనలో కొత్త కోణాన్ని పరిచయం చేశారు. ఇక -పెళ్లిచూపులు- వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌తో ఓ ట్రెండ్ సెట్ చేసిన రీతు వర్మ.. అప్పట్నుంచీ గ్రేస్‌ఫుల్ పెర్ఫార్మెన్సెస్ ఇస్తూ వస్తున్నారు. టూ టౌన్, నిన్ను కోరి వంటి విజయాల తర్వాత ప్రస్తుతం -భారతవర్ష-వంటి భారీ ప్రాజెక్ట్‌లలో నటించారు.తనదైన నటన- సహజమైన అందంతో తెలుగు తెరపై ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈషా రెబ్బ.. ఓం శాంతి శాంతి శాంతిహి అనే చిత్రంలో నటించడమే గాక 3 రోజెస్ అనే వెబ్ సిరీస్ లోను నటించారు. తదుపరి వస్తా నీ వెనుక (రమేష్ వర్మ దర్శకత్వం) చిత్రంలో నటించారు. ఈ ఏడాది డిసెంబర్ లో ఈ చిత్రం విడుదల కానుంది. అలాగేటైటిల్ లేని విక్రమ్ ప్రభు ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఆయిరం జెన్మంగల్ (దర్శకుడు ఎజిల్) -- డిసెంబర్ లో విడుదల కానుంది. కంటెంట్ ఓరియంటెడ్ చిత్రాలు.. వెబ్ సిరీస్‌ల ద్వారా విపరీతమైన పాపులారిటీ తెచ్చుకున్న కామాక్షి భాస్కర్ల, తన డీప్ పెర్ఫార్మెన్స్‌తో మంచి నటిగా గుర్తింపు పొందారు. ఇటీవల విడుదలైన అగధ చిత్రంతోను కామాక్షి పేరు మార్మోగింది. తనదైన ఫియర్‌లెస్ యాటిట్యూడ్ తో ఆకట్టుకోవడం ఈ భామ ప్రత్యేకత.బిగ్‌బాస్ ద్వారా వెలుగులోకి వచ్చి... గ్లామర్ పాత్రలతో పాటు సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే దివి వద్యత పలు చిత్రాలలో కీలక పాత్రలు పోషిస్తూ తన కెరీర్‌ను మలుచుకుంటున్నారు. యూత్ ఫుల్ లవ్ స్టోరీలు .. డిజిటల్ కంటెంట్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న శ్రీ గౌరి ప్రియ, వరుస ప్రాజెక్ట్‌లతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంటున్నారు. -పెదకాపు 1- వంటి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తన అభినయంతో ఆకట్టుకున్న శివానీ నాగరం ప్రస్తుతం కొన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లలో ఆఫర్లు దక్కించుకుంటూ కెరీర్‌లో ముందుకు వెళ్తున్నారు. మరోవైపు ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్న తెలుగమ్మాయి మానస వారణాసి గ్లామర్ ప్రపంచంలో తన అందచందాలతో పాటు సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యకలాపాలతోనూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com